జీవితం ఎందుకు?

వింధ్యవాసిని



అది ఒక సముద్రతీరం. అంతగా మనుష్య సంచారం లేనిచోటు. సమయం సాయంకాలం ఆరుదాటి వుంటుంది. చలికాలపు సాయంకాలమేమో చిక్కగా చీకటి ముసురుకోవడాని కింక ఎక్కువ వ్యవధి లేదు. ఆ కనుచీకటి వేళలో ఒక స్త్రీ - వయసు దాదాపు ముప్ఫయి వుండొచ్చు – ఒక ఎనిమిది సంవత్సరాల పిల్లవాడు కూచునివున్న చక్రాలబండిని గబగబా తోసుకుపోతుంది సముద్రం వయిపుగా.

ఇసుకలో బండి తోయటం కష్టంగానే వుంది. అయినా ఆమె దృష్టి ఆ కష్టంపైన లేదు. ఏదో నిర్ణయించుకుని, అందుకోసం తెగించినదానిలా, ఎదురుగా అలలతో ఎగిరిపడుతున్న సముద్రం వయిపే దీక్షగా చూస్తోంది. ఆవిడ మనసులో వున్నదేమిటో, కుర్చీలో కూచునివున్న పిల్లవాడికి తెలియదు. అతని కిదేమీ అర్థంకావటం లేదు తల్లి తననిలా, ఈ నిర్మానుష్యమయిన సముద్రతీరానికి తీసుకురావటమే కొత్తగా వుంది. అందులోను నీటి వయిపుగా బండి తోసుకుపోవటం ఒక వింత.

నిముష నిముషానికీ తలఎత్తి అమ్మ ముఖాన్ని చదవటానికి ప్రయత్నిస్తున్నాడా కుర్రవాడు. కానీ ఆవిడ కివేం పట్టటంలేదు. ఆమె కొడుకుతోపాటు ఈ లోకంనించి శాశ్వతంగా దూరం కావాలనే ప్రయత్నంలోనే సముద్రంలోకి వెళుతోంది. ఆమెకీ అవిటికొడుకు తప్ప జీవితంలో ఏమీ మిగలలేదు. అందుకనే జీవితాన్నిలా అంతంచేసుకోవాలని వెళుతోంది. ఆ ఆవేశంలో తనతోపాటు, కుర్రవాడి ప్రాణాలు కూడా తీసేహక్కు తనకుందా అని ఆవిడ తన్ను తాను ప్రశ్నించుకోలేదు.

రానురాను బండి ముందుకు నెట్టటం కష్టమయింది. అతికష్టంమీద కుర్రవాడ్ని గుండెలకి అప్పుకుని నడుచుకుంటూ

ముందుకు సాగిందామె. బాగా నీటి దగ్గరికి చేరేసరికి పిల్లవాడు అడిగేడు.

"అమ్మా, ఎక్కడికమ్మా? ఇంకా వెళితే కొట్టుకుపోతాం. పదమ్మా వెనక్కి" అన్నాడు.

"వద్దు బాబూ. మనలాంటి వాళ్ళకి లోకంలో చోటులేదు. నేనీ జీవితాన్నీడ్వలేను. మనిద్దరం కలిసి ఒక్కసారే చచ్చిపోదాం" అంటూ ముందుకి నడుస్తోంటే మెల్లిగా పాదాల క్రిందకి అలలు తాకి, అక్కడున్న ఇసుక కదిలిపోతోంది.

కుర్రవానికెటూ తోచడంలేదు.

"వద్దమ్మా నాకు చావాలని లేదు. వద్దు వద్దమ్మా....నాకింకా చాలా ఏళ్ళు బతకాలని వుంది....అమ్మా, నా మాట వినవూ!"

ఈ మాటలా తల్లి చెవికెక్కటం లేదు. పిల్లవాడికేం తోచటంలేదు. ఆఖరుకి, "నన్నైనా వదిలెయ్యమ్మా" అని గట్టిగా అరిచాడు.

బలాన్నంతా ఉపయోగించి ఆమె చేతుల్నుంచి విడిపించుకుని, పత్తువలేని కాళ్ళపై నిలబడలేక, ఒక్క గెంతుతో అలల తాకిడికి తడిఅయిన ఇసకలో కూలబడి, దేకుతూ బండి వయిపుగా వెళ్ళసాగేడు.

తలమీద పిడుగుపడినట్టిలా అయిపోయింది తల్లి పరిస్థితి. వీడు-తన కొడుకు-రెండు కాళ్ళులేని ఈ పసివాడికి బ్రతకాలని ఆశ. 'నీవు చచ్చినా సరే, నన్ను వదిలెయ్యి' అని వెళ్ళిపోతున్నాడు. కర్తవ్యతా విమూఢురాలై కొడుకు వయిపు చూస్తోండిపోయింది.

ఇంతవరకూ తన ఆవేశంలో గమనించలేదు. ఎవరో ఒక వృద్ధుడు పిల్లాణ్ణి లేవనెత్తి చక్రాల బండిలో కూచోబెట్టున్నాడు. ఈ వేళప్పుడు ఇక్కడ తిరుగాడుతున్న ఈ వ్యక్తి ఎవరా అనే ఆశ్చర్యంతో, తెలియకుండానే ఆమె అడుగులు అటుగా పడ్డాయి.

ఆయన తలఎత్తి చూసాడు. కొద్దిగా మిగిలివున్న వెలుతురులో అతని వయిపు చూసింది. వయసెంతో చెప్పటం కష్టం. మెడలకిందికి వున్న జుట్టు, బాగా పెరిగిన బవిరి గడ్డమూ, చూస్తే సన్యాసిలా కన్పించాడు. చిన్న కాషాయ రంగు గావంచా కట్టుకుని, అదే రంగు తుండు గుడ్డ ఒకటి భుజాన వేసుకుని వున్నాడు. అప్పుడే స్నానంచేసి వస్తున్నట్లుగా, ఒంటిమీద నీటిచుక్కలున్నాయి.

బాగా దగ్గిరయాక ఆ ముఖం వయిపు చూసి, తప్పుచేసిన దాన్లా తలవంచుకుంది. 'నేను మొదట్నుంచీ అంతా చూస్తూనే వున్నానులే' అన్నట్లున్నాయా చూపులు.

ఆయన, "నేనిప్పుడు నిన్నేమీ అడగను. భయపడొద్దు. అల్లదిగో ఆ గుబురు చెట్లకవతల ఉంది మా ఆశ్రమం. అటు వెళదాం, పదండి" అని జవాబుకోసం చూడకుండా బండీని తోసుకుని ముందుకు నడిచాడు. మౌనంగా ఆయన వెంట నడిచిందామె.

తరువాత పేజీల్లో చూడండి :

పది నిముషాలలో ఆశ్రమం చేరారు. అక్కడ, చుట్టూ నిలువెత్తు గోడలు, పైన గడ్డికప్పిన విశాలమయిన పర్ణశాల ఒకటి, దానిచుట్టూ చిన్నచిన్న తాటాకు గుడిసెలు కొన్ని వున్నాయి. సముద్ర తీరానికింతదగ్గరగా వున్న ఈ ఆశ్రమాన్ని ఆమె ఎప్పుడూ చూడలేదు.

వీళ్ళు వెళ్ళేసరికి పూర్తిగా చీకటయింది.... నలుగురయిదుగురు కాషాయ దుస్తులు వేసుకునివున్నవారిటువచ్చారు. వారిలో ఇద్దరు యువకులు; ఇద్దరు నడివయస్కులూ కూడా వున్నారు. వారు వేసుకున్న దుస్తులవల్ల తేడా లేమీ లేక, ఒకేలా కనిపిస్తున్నారు. ఎంతో భక్తిగా ఎదురొచ్చి, "ప్రార్థనకు వేళయింది స్వామీ" అన్నారు. ఆయన వారి గురువు కాబోలు అనుకున్నదామె.

ఆయన వీళ్ళిద్దర్నీ చూపుతూ, "వీరు మన అతిధులు. వీరికి భోజనానికి పడకకి ఏర్పాట్లు చూడండి. అంతులేని మనస్తాపంతో వున్న వీరికే కష్టమూ రాకుండా చూసుకోవటము మన బాధ్యత" అన్నారు. ఆ మాటల్లోని దయకు ఆ తల్లి హృదయం కరిగి నీరయింది. మంత్రముగ్ధురాలిలా వారివెంట ప్రార్థనా మందిరానికి తరలి వెళ్ళింది.

* * *

పార్వతికి ఉదయం మెలకువ వొచ్చే సరికి బాగా తెల్లారిపోయింది. [illegible] తను రాత్రి పక్కనుంచుకునే [illegible]

వంక చూడబోయింది. అప్పుడు గుర్తొచ్చాయి రాత్రి జరిగిన సంఘటనలు.

పక్కనే కొడుకు శ్రీధర్ అదమరిచి నిద్రపోతున్నాడు. ఇలా ఈ రోజుని ఈ సూర్యోదయాన్ని చూడకుండా వెళ్ళాలని ప్రయత్నించింది. ఆ ప్రయత్నం ఫలించలేదు. ఈ స్వామివారు అడ్డుపడ్డారు—అనుకుంది.

రాత్రి తోడుగా ఒక వృద్ధురాలు పడుకుంది. ఆవిడెప్పుడు లేచిపోయిందా అని పార్వతి అనుకుంటుండగానే, రెండు పెద్ద కంచు గ్లాసులలో వేడి పాలు తీసుకొచ్చి, "ప్రార్థన అయిపోయింది. స్వామి మిమ్మల్ని రమ్మన్నారు. లేచి కాలకృత్యాలు తీర్చుకుంటారా?" అని సౌమ్యంగా చెప్పింది.

అరగంటలోపల పార్వతి, ఆ కొడుకు మరొక పర్ణశాలలో, పులిచర్మంపై ఆసీనులై వున్న స్వామిముందు, తుంగ చాపమీద కూచుని వున్నారు. వారిద్దరే కాక ఇంకా కొందరు శిష్యులు కూడా వున్నారు. కానీవారంతా పుస్తకపఠనమో, ధ్యానమో, జపమో తమ పని తాము చేసుకుంటున్నారు.

"ఇప్పుడు చెప్పమ్మా. నీ కష్టమేమిటో? ఎందుకంత దైర్యం చేయబోయావ్?" అని మెల్లిగా అడిగేడు స్వామి.

పార్వతికెలా చెప్పాలో తోచలేదు. చెప్పటమంటూ జరిగితే ఒక్కమాటలో అయేదికాదు. విధంగా విప్పి చెప్పాలి.

"ఫరవాలేదు చెప్పమ్మా. నే నీకేమయినా సహాయం చేయగలిగితే సంతోషిస్తాను. లేదా నీ దారికి అడ్డురాను. సరేనా? అయినా కూడా ముందొక మాట చెబుతాను. జీవాన్నిచ్చిన దేవుడికే దాన్ని తిరిగి తీసుకునే శక్తి వుంది. ఎంత కష్టం వచ్చినా ఆ బాధ్యత మనపై వేసుకునే హక్కు మనకి లేదు. విలవ టావికి కాళ్ళులేవి ఈ పిల్లవానికే బ్రతకాలని అంతటి ఆశ, అమ్మ పోయినా సరే, నాకు చావు వద్దు అనే తెగింపు వున్నాయే? మరి నీ కెందుకింత విరాళ? పడిన కష్టం చెప్పుకుంటే కొంత భారం తీరుతుంది చెప్పమ్మా."

పార్వతి మొదలుపెట్టింది. స్వామి కళ్ళు మూసుకొని వింటున్నారు.

* * *

పార్వతి బాగా ధనవంతుల ఇంటనే పుట్టింది. తల్లిదండ్రుల కొక్కతే కూతురు. అంచేత ముద్దుగా పెరిగింది. అయితే ఆ అదృష్టం బాల్యంలోనే తీరిపోయింది. తండ్రి, చేస్తున్న వ్యాపారం దెబ్బతిని గుండెపోటుతో మరణించాడు. అప్పటికి పెళ్ళీడుకొచ్చిన పార్వతితో ఎలా బ్రతకాలో తోచలేదు తల్లికి. కొందరు చుట్టాల సహాయంతో, ఒక రెండోపెళ్ళివానికి కట్టబెట్టింది పార్వతిని. తానేదో ఓ చిన్నదుకాణం పెట్టుకుని బ్రతకసాగింది. ఇప్పుడామె లేదు కాలం చేసి వెళ్ళిపోయింది.

గుడ్డిలో మెల్లలాగా పార్వతి భర్త రామ్మూర్తి ఆమెని బాగానే చూసుకునే వాడు. మొదటి భార్యవల్ల పిల్లలు కలగ లేదు. అందుకని ఆవిడ పోయాక నలభై అయిదేళ్ళ వయసులో, మళ్ళీ పార్వతిని పెళ్ళిచేసుకున్నాడు. అతను అంతదాకే భార్యనుండిపొందాల్సిన సుఖాలన్నీ అనుభవించేడు. ఇప్పుడింక ఒక్క సంతాన అపేక్ష తప్ప వేరే ఆశలేదు.

తండ్రిపోయిననాడే ఆశలన్నీ కూలిపోయిన పార్వతి ఈ పెళ్ళివల్ల పెద్దగా బాధపడిందేం లేదు. కానీ రామ్మూర్తి గురించి, సంబంధం కుదిర్చిన పెద్దలు చాలాగొప్పగా చెప్పారు. తండ్రిచావుతో పోయిన ఆస్తి, అంతస్తు తిరిగి పొంద వచ్చని ఆశపడిన పార్వతికి నిరాశే ఎదురయింది. చెప్పిన గొప్పల్లో వున్న నిజం చాలాతక్కువనీ, అతనికి ఆస్తితో పాటు, అతని తండ్రి మిగిల్చిన అప్పులు కూడా వున్నాయనీ, పెళ్ళయ్యాక ఎన్నాళ్ళకో తెలుసుకుంది.

ఒక విధమయిన నిస్పృహ ఆవరించిందామెని. అయితే రామ్మూర్తి ఈమెనే కోరికతో పెళ్ళాడాడో ఆ కోరికమాత్రం తీర్చగలిగింది.

శ్రీధర్ పుట్టటంతో ఏదో ఒక ఆశ చిగురించింది పార్వతి మనసులో. 'మొదటగా కొడుకుపుట్టటం నా అదృష్టం; వీడ్ని చూసుకొనయినా అన్నీ మరచిపోతాను" అని మనసు కుదుటపర్చుకోవాలని ప్రయత్నించింది. వారి ఇంట యువరాజులా వెలిగిపోయాడు శ్రీధర్. ఎంతో ముద్దుగా చూసేవాడు తండ్రి.

పెద్దగా ఆస్తి లేకపోయినా, తరాల నించీ వచ్చిన వంశప్రతిష్ఠ ఒకటి మిగిలుంది రామ్మూర్తిలో. ఆ చిన్నవూరిలో నానా అలగాజనంతో, తన కొడుకుని స్కూల్‌కి పంపటం అతనికి నచ్చలేదు. ప్రత్యేకం ఒక మాష్టార్ని పెట్టి చదివించసాగేడు. పార్వతి కిదేం ఇష్టం లేదు. ఇనొక దుబారా ఖర్చు అనునేది. కానీ ఆమె చెప్పినా ఉపయోగం వుండదని తెలుసు.

పిల్లలకోసం మొహం వాచివున్నాడేమో, అతనికి తన కొడుకు దేవుడిచ్చిన వరమని, వాడిని ప్రత్యేకంగా పెంచాలనీ అనుకునేవాడు. ఆ పిచ్చి ప్రేమలో పార్వతి మాటలేం తలకెక్కుతాయి?

శ్రీధర్ పుట్టిన మూడేళ్ళకి మళ్ళీ గర్భవతయింది పార్వతి. అంతవరకూ కొడుకును చూసుకుని మురిసిపోతున్న రామ్మూర్తి ఈసారి కొత్త ఆలోచనలో పడ్డాడు. తన వయసు చూస్తే ఏభై దాటుతోంది. తనున్నాపోయినా ఉన్న ఆస్తిలో పార్వతికి శ్రీధర్‌ని పెంచటం ఏమంత కష్టంకాదు. ఇంకొక అమ్మాయో, అబ్బాయో పుట్టినా ఫరవాలేదు. అంతకు హెచ్చు అవుతే కష్టమే—అని ఆలోచించుకుని, ఈసారి పార్వతికి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయిద్దామని నిర్ణయించు

తున్నాడు. ఇందుకు పార్వతి ఒప్పుకుంటుందనే నమ్మకం లేదు. అందుకనే ఆమెతో చెప్పలేదీ విషయం.

అతననుకున్నదే నిజమయింది. పార్వతికి ఇద్దరు పిల్లలతో నిలిపేయాలని లేదు. కనీసం నలుగురయినా కావాలని ఆశ. ఎలాగో కష్టపడి పెద్దవాళ్ళని చేస్తే పిల్లలయినా తన ఆశలు తీరుస్తారని తలచింది. ఈ మధ్యలో రామ్మూర్తి ఆరోగ్యము అంతంత మాత్రంగానే వుంది. అతను పోయినా తనకు తోడుగా తన పిల్లలయినా నిలవాలని కోరుకుంది. తన తల్లికి తనొక్కతే. అందులోనూ ఆడపిల్లయి ఏమీ చేయలేకపోయింది. తనకయినా నలుగురు బిడ్డలుంటే, వాళ్ళే తనకి ఆసరా అవుతారు. ఇంక దేనికీ భయపడకుండా జీవితాన్ని సాగించగలను అని ఆశపడింది.

ఇలాంటి ఊహాల్లో వున్న పార్వతికి మగపిల్లవాడే పుట్టేసరికి మరింత సంతోషమయింది. దేవుడీ రూపంలోనే అయినా తన ఆశలు తీర్చుతున్నాడని తృప్తి పడింది. పిల్లవాడు పుట్టినాక మూడో రోజు కాబోలు చెప్పారు ఆపరేషన్ చేస్తారని. ఆమె ఎంత వ్యతిరేకించినా లాభం లేకపోయింది.

వారం పదిరోజులపాటు ఏడుస్తూ భర్తని ఆక్షేపిస్తూనే వుంది పార్వతి. ఆమెకతనిమీద చెప్పలేనంత కసిగా వుంది.

అతనెన్నోవిధాల నచ్చజెప్పబోయాడు. "అదికాదు పార్వతీ! నాకా వయసయిపోయింది. ఎన్నాళ్ళుంటానో తెలీదు. ఇలాంటి పరిస్థితిలో ఇద్దర్ని మించి పిల్లల్ని కంటే నీకే కష్టం అవుతుందనే నేనీపని చేసాను. అంతో ఇంతో చదువుకున్నదాని విలా పిచ్చిదాన్లా, ఏడుస్తూ కూచుంటే నీ ఆరోగ్యమేంకాను? కొంచం నన్నర్థం చేసుకుని, నీ మనసు సంబాళించుకో" అని ఎంతో సౌమ్యంగా చెప్పేడు.

తనతో ఒక్క మాటయినా చెప్పకుండా అతనలా అన్నీ ఏర్పాట్లూ చేసి, తన తలవంచి మోసంచేశాడని అనుకుందామె. ఇదంతా ఒక కుట్రలా అనిపించిదామెకి. ఆ బుద్ధిమాంద్యతలో, భర్త చెప్పినమాటలే చెవినెక్కలేదు.

"అసలు నలుగురు పిల్లల్ని కనే యోగ్యత లేనివారు, ఈ వయసులో పెళ్ళెందుకు చేసుకోవాలి? నా బ్రతుకు మట్టుపెట్టటానికి కాకపోతే. మీ కేదో గొప్ప ఆస్తి, అంతస్తు వున్నాయని నన్ను మీకు కట్టబెట్టింది మా అమ్మ. అయినా మిమ్మల్నేం లాభం? నా ఖర్మ. మీరే అడ్డుపడకపోతే, డబ్బులేకున్నా కనీసం భార్యని ప్రేమగా చూసుకొనే వాడయినా నాకు దొరికుండేవాడు.

"నేను సుఖపడటం సంతోషంగా వుండటం మీకసలు ఇష్టంలేదు. అందుకే ఇలా చేశారు" అని ఎన్నాళ్ళో వాదించింది.

తరువాత పేజీల్లో చూడండి!

ఆమె ఎన్నిమాటలన్నా, రామ్మూర్తి చెక్కుచెదరలేదు. తను చేయవలసింది తాను చేశాననీ, తన బాధ్యత తాను తీర్చుకున్నాననీ సంతృప్తిపడ్డాడు. కొడుక్కి శ్రీనివాసు అని పేరు పెట్టుకున్నాడు.

శ్రీధర్ తండ్రికి చేరికయితే, శ్రీనివాసు తల్లికి దగ్గరయ్యాడు. అమ్మంటే ఎంతో ప్రేమగా వుండేవాడు కాస్త బుద్ధి తెలిసినప్పట్నుంచీ. అమ్మ నాన్నపట్ల ఏర్పరచుకున్న ఉదాసీనత, పెంచుకొన్నకోపం వయసు పెరుగుతున్నకొద్దీ ఒక్కొక్కటీ అర్థమవుతున్నాయి వాడికి. దాంతో ఏదో తెలియని అస్పష్టత ఏర్పడింది తండ్రి అంటే. ఆయనతో ఎక్కువగా మాట్లాడేవాడు కాదు దగ్గరికి వెళ్ళేవాడు కాదు. ఆయన అమ్మకేదో అన్యాయంచేశాడనే భావం వాడిమనసులో నిల్చిపోయింది. రామ్మూర్తి మాత్రం భార్యకోపాన్ని హాలాహలాన్ని మింగిన శివుడిలా భరిస్తూవొచ్చాడు. కొడుకులిద్దరూ రెండు కళ్ళనుకునేవాడు.

ఆరోజు - కొడుకులిద్దరూ ఆడుకుంటామని పక్కవీధిలోకి వెళ్ళి, హఠాత్తుగా మొదలయిన జడివానలో తడిసి వణుకుతూ వచ్చి ఇల్లుచేరినరోజు - ఒక దుర్దినం, ఆ తల్లిదండ్రుల జీవితాల్లో. తెల్లవారేసరికి పిల్లలిద్దరూ జ్వరంతో పడ్డారు. ఊళ్ళోవున్న ఒకే డాక్టర్ని పిలిపించాడు రామ్మూర్తి. అతను మామూలు జ్వరమే అని మందిచ్చి వెళ్ళాడు. అది మెల్లిగా

నిమోనియాలోకి వెళ్ళటానికి మూడు రోజులు పట్టింది. ఎన్ని మందులిచ్చినా బూడిదలో పోసిన పన్నీరయినాయి.

పదో రోజుకి కాబోలు టెంపరేచర్ ఎక్కువయి, శ్రీనివాస్‌కి ఫిట్స్ వచ్చి, డాక్టర్ వచ్చేలోగా ప్రాణాలు విడిచాడు. ఈ విషయం తెలిసినవెంటనే రామ్మూర్తికి షాక్‌తో గుండెనెప్పి వచ్చింది. ఆతనికిలా రావటమిది నాలుగోసారి. చాలా స్ట్రాంగ్ స్ట్రోక్ వచ్చిందనీ, ఇంకొక్కసారిలా వస్తే బ్రతకడం కష్టమనీ చెప్పాడు డాక్టర్.

సరిగ్గా అప్పుడే కొడుకుపోయిన దుఃఖానికి తోడు, భర్త ఆరోగ్యాన్ని గూర్చిన దిగులు పట్టుకుంది పార్వతిని. ఎటువంటివాడయినా కట్టుకున్న భర్త. అతను బతికున్నన్నాళ్ళు ఒక రక్షణ. తనకి చేతనయినంతలో ఏదో వ్యాపారం చేసి సంపాదిస్తున్నాడు. అతను పోతే తనేం చేయగలదు ఇంతవరకూ బాధ్యతలంటే ఏమిటో ఎరగదు తను. అందుకే భయం వేసింది.

భర్త ఆరోగ్యం బాగుంటే చాలు - ఉన్న ఒక్క కొడుకూ చాలు - అని వాణ్ణి చూసుకుని సంతృప్తి పడింది. శ్రీనివాసు పోయిన దుఃఖాన్ని కూడా మరిచి, కొడుక్కీ, భర్తకీ శ్రద్ధగా సేవలు చేసింది.... ఆ కొన్ని రోజుల్లో రామ్మూర్తి ఆమెలో మంచితనమూ, అభిమానమూ వున్న మరో మనిషిని చూసాడు. ఇలాగే గడిచిపోతే చాలు అనుకున్నాడు.

కానీ అదీ ఎన్నాళ్ళో నిలవలేదు. జ్వరం తగ్గి పథ్యం తిన్నాడు శ్రీధర్. నెల రోజులకి బాగా కోలుకున్నాడనుకున్న ఒక రోజు, నడవబోయి కింద పడితే తెలిసింది కాళ్ళు పడిపోయాయని. విషయం తెలుసుకున్న డాక్టర్, రామ్మూర్తికి చెబితే ఇంకోసారి గుండె నొప్పి రావచ్చనీ, అందులోనే మరణించవచ్చనీ భయపడ్డాడు. కానీ చెప్పక తప్పలేదు. నరాలు బలహీనమయి కాళ్ళు పోయాయని, ఏదయినా పెద్దాసుపత్రిలో చూపితే నయమేమోనని అన్నాడు.

చిత్రంగా ఈ దెబ్బని తట్టుకున్నాడు రామ్మూర్తి. అప్పుడు కొంత పశ్చాత్తాపం చెందాడు. తను భార్యకి ఆపరేషన్ చేయించి తప్పుచేశానేమో అని. అందుకనే ఎలాగయినా, ఎంత ఖర్చయినా సరే, కొడుక్కి బాగుచేయించాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

నీరసంతో మంచంలోపడ్డవాడు కాస్త బలాన్ని పుంజుకుని లేచి తిరగసాగేడు. తన దగ్గర ఇన్నాళ్ళు చేర్చుకున్న డబ్బులో కొంత చేతపట్టుకుని పట్నానికి ప్రయాణమయాడు.

అతనెందరు డాక్టర్లని చూసేడో, ఎన్ని ఆస్పత్రులు తిరిగాడో లెక్కలేదు డబ్బుమంతే ఖర్చయింది కానీ పిల్లవాడికి కాళ్ళు మాత్రం రాలేదు ఖర్చు

లతో చేర్చుకున్న డబ్బంతా కరిగి పోయింది. పార్వతి సొమ్ములూ అమ్మే శాడు. దగ్గిరుండి చూసుకోక వ్యాపారం దివాలా తీసింది. అన్ని విధాలా గాలి తీసిన బంతిలా అయిన రామ్మూర్తి మూడొందలు ఖర్చుచేసి చక్రాల బండి కొని, కొడుకుని కూచోబెట్టుకుని ఇల్లు చేరాడు.

ఎప్పుడో మరిచిన కోపమూ, కసి తిరిగి చోటుచేసుకున్నాయి పార్వతి మనసులో. అన్ని విధాలా తన బ్రతుకిలా అవడానికి కారణం భర్తే ననే అభిప్రాయ మామెలో బలంగా నాటుకు పోయింది. కానీ రామ్మూర్తి మెదడు మొద్దుబారిపోయింది. దెబ్బమీద దెబ్బ తగలటంతో అతనికి ఆమె మాటలు అంత బాధను కల్గించేవిగా కన్పించ లేదు. నిజంగా తానామెకి అన్యాయమే చేశాననే భావ మతనిలోనూ చోటుచేసు కుంది. దేనికీ జవాబు చెప్పేవాడు కాదు. పల్లెత్తి మాట్లాడేవాడు కాదు. ఆ సమయంలో అతనికి కాళ్ళులేని కొడుకు మాటలే తోడయాయి. ఆ కుర్రవాడు చాలా గుండెధైర్యం కలవాడు. ఎప్పటి కయినా తన కాళ్ళు బాగవుతాయనీ తను మళ్ళీ మామూలుగా నడవ గలుగుతా ననీ ఆశ వుంది అతనికి.

ఎవరో తెలిసినవాళ్ళు చెప్పారు, రాయవేలూరు హాస్పిటల్‌కి తీసుకెళితే బాగవచ్చని. అక్కడ ఎలాంటి ఆశ వదిలేసిన రోగాలైనా బాగుచేస్తారనీ, ఫారిన్ డాక్టర్స్ ఎందరో వుంటారనీ అన్నారు రామ్మూర్తికి అదీ ప్రయత్నిం చాలని వుంది. కానీ వేలూరు వెళ్ళటం అంటే మాటలు కాదు. అయిదారు వేలయినా చేతబట్టుకుని వెళ్ళాలి. అంత డబ్బు తన కెక్కడిది? మిగిలిందల్లా ఉన్న ఇల్లు, తినడానికి గింజలు పండు తున్న మూడెకరాల భూమి. ఏదో ఒకటి తాకట్టుపెట్టి డబ్బు తేవాలి.

'ఏమి చేద్దా'మని పార్వతిని అడిగాడు. పెళ్ళయిన నాడే ఆమె తల్లి పట్టుదల మీద ఆ భూమి, ఇల్లు పార్వతి పేరనే రాసేశాడు రామ్మూర్తి. అందుక నిప్పు డామె ఒప్పుకుంటే తప్ప ఏమి చేయ టానికి లేదు. కానీ పార్వతి మాత్రం, "తినటానికి తిండి, తల దాచుకునేందుకు ఇల్లు అయినా లేకుండా చేస్తారా?" అని విస్ఫారమాడింది. "అంత డబ్బు ఖర్చ యినా, వీడికి బాగవుతుందనేం నమ్మకం? నేను చచ్చినా సంతకం చెయ్యను" అనే సింది.

అంతదాకా కూడదీసుకున్న ధైర్యం మెల్లిగా జారిపోయింది రామ్మూర్తిలో. క్రమంగా మళ్ళీ జబ్బుపడి ఆరునెల్ల పాటు మంచాన పడి ప్రాణాలు వది లాడు. ఆ ఆరునెలలూ ఆతన్ని పార్వతి తిట్లు, శాపనార్థాలు నంటే, తాను పోతే, పిల్లదరి గతి ఏమిటా అనే దిగులు ఎక్కువగా కుంగదీసింది.

మనిషి పోయాకగానీ విలువ తెలిసి రాదంటారు. అలాగే అయింది పార్వతి పరిస్థితి కూడా. బ్రతికున్నన్నాళ్ళూ చీద రించుకున్న భర్త పోతే, నెల రోజులు తిండీ, నిద్రా లేకుండా ఏడ్చింది.

రామ్మూర్తెప్పుడు చస్తాడా అని కాచు కుని కూచున్న రాబందుల్లాంటి అప్పుల వాళ్ళు ఉన్నది కాస్తా, లేనిది కాస్తా అప్పుచూపి, మోసంతో ఉన్న కాస్త పొలాన్ని అమ్మి పంచుకున్నారు. అప్పు డనుకుంది పార్వతి - కనీసం, భర్త అడిగినప్పుడే ఒప్పుకుని భూమి అమ్మ నిచ్చినా బాగుండేది. పిల్లాడికి కాళ్ళయినా వచ్చుండేవేమో - అని. ఇప్పుడనుకుని ఏం లాభం?

సరిగ్గా అటువంటి పరిస్థితిలోనే ఆత్మ హత్య చేసుకుంటే అన్ని కష్టాలు అంత రిస్తాయి - అనే భావం వచ్చిందామెకి. ఏకంగా తనూ, పిల్లాడు సముద్రంలో దూకేస్తే ఏ పీడా వుండదు. అసలింకా బ్రతికుండటం ఎందుకు? ఏం బావుకో వాలని? అని ఎన్నాళ్ళో ఆలోచించి, అనాడా ప్రయత్నం చేయబోయింది. తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తా దన్నట్లు అదీ తప్పింది. ఈ విధంగా కూడా తనకి అన్యాయమే జరిగిందను కుంది పార్వతి.

* * *

చెప్పటం ముగించింది. కొన్నిక్షణాల పేపు మవునంగా వుండిపోయాడు స్వామి ఏదో ఆలోచిస్తున్నట్లుగా.

"ఇప్పుడు నీ వయసెంత?" అన్నాడు.

ఎందుకడుగుతున్నారో అర్థంకాలేదు పార్వతికి అయితే అతను చీకటివేళలో హఠాత్తుగా ఎదురుపడినప్పుడే ఆయన పట్ల ఏదో పూజ్యభావ మేర్పడిం దామెలో. ఆ భక్తివల్లనే సమాధానం చెప్పింది.

"ముప్ఫయి స్వామీ" అని.

"కాదు.... నీ కిప్పుడు అరవయి ఏళ్ళనుకో. ఎన్నో విధాల రోగాలతో నీ శరీరం క్షీణించి వుంది. మరణశయ్య మీద వున్నావు. అరవయ్యేళ్ళ జీవి తంలో నేను సాధించిన దేమిటో అని గత జీవితాన్ని నెమరు వేసుకుంటు న్నావు. ఇలా ఊహించుకో. ఇక నీ జీవితాన్ని గూర్చి నేను చెబుతాను" అని మొదలుపెట్టారు గంభీరంగా అయన నోట వస్తున్న మాటల్ని మంత్ర ముగ్ధలా వింటూ వుండిపోయింది పార్వతి. అయన ఆదేశంలో వున్న మహిమ ఎమిటో గానీ, అచ్చంగా అది తన కథే అయినట్లు ఊహించటంలో కృతకృత్యురాలయింది.

* * *

కోటికి పడగెత్తిన జమీందారు చంద్ర బోసు గారి ముద్దుల బిడ్డ శివాని. జమీం దారుగారు గొప్ప శివభక్తులు. అందుకే శివాని అని కూతుర్ని ముద్దుగా పిల్చు కున్నాడు. తల్లిలేని బిడ్డని బాగా

తరువాత పేజీల్లో చూడండి :

గారాబం చేస్తూ వొచ్చారు. ఆమె చదువంతా చిన్నప్పట్నించీ మంచి కాన్వెంట్‌లో సాగింది. అమె స్కూలు చదువు ముగిసేసరికి, కూతురి మీద ఓ లక్ష రూపాయలు ఖర్చుచేసి వుంటారు జమీందారు. తన మాట కద్దులేదనీ, తను కోరటం, అది తీరకపోవటమూ అనేది లేదని, శివానికి బాగా గర్వం. అందుకు తోడు చదువూ బాగానే అబ్బింది. అది ఆమెలో మరింత అహంకారాన్ని పెంచింది. జీవితమంటే ఒక ఆటలా, పాటలా గడిపేయటమే అనుకుంది.

అప్పుడే వచ్చిన వయసుతోపాటు మారిన ఆలోచనలకి, కాలేజీ వాతావరణం దోహదం చేసింది. ఎన్నో రకాల మనుషులతో పరిచయాలు, స్నేహాలు, సరదాల్లో చదువు వెనకబడింది. కూతురు చదవటం ఏదో ఒక గౌరవంకోసమే గానీ, కష్టపడి చదవాలని చంద్రబోసు గారెన్నడూ అనుకున్నది లేదు అందుకే కాన్వెంటునుంచీ బయటపడ రెక్కలొచ్చిన పక్షిలా ఎగుర్తున్న కూతుర్ని చూసి ముచ్చటపడ్డారె. సరదాలు తీరే వయసిదే. మళ్ళీ పెళ్ళీ, సంసారము అంటూ మీదబడితే, ఇంక స్వాతంత్ర్యమేం వుంటుంది? అనుకునేవారు. ఆమె ఖర్చులు వందలకు వందలు అయిపోతా

యని దివానుగా రెంత మొత్తమున్నా పెడచేతిన పెట్టేవారు

ఇలా ఆటపాటల్లో కాలం గడుపుతున్న ఈ కోటీశ్వరుని ముద్దుబిడ్డని ఒక అమాయక యువకుడు ప్రేమించాడు అందమూ, ఆ స్త్రీతోపాటు మంచి మనసుకూడా వున్నదని తెలిసి మోస పోయాడు ఒక మామూలు మధ్య తరగతి వాణ్ణి మనసారా కోరి పెళ్ళాడేందుకు శివాని పిచ్చిదికాదు. అతను తనపై చూపుతున్న ప్రేమకి వేరే అర్థం చెప్తుకుంది తన అభిమానాన్ని తన ఆస్తిపై ఆశగా అపార్థం చేసుకుంది

అయినా తన మనసులో భావాలేమీ బయిటపెట్టకుండా, అతన్ని తనవెంట తిప్పుకుంది ఒక ఆటబొమ్మలా ఆడుకుంది అతన్ని యూపాన్ని తన గర్భంలో చేర్చుకువేవాకా, మోహంతో మూసుకుపోయిన ఆమె కళ్ళు తెరచుకోలేదు

విషయం తెలసిని చంద్రబోసుగారు మొదట్లో గాభరాపడ్డారు తర్వాత ఆలోచించారు డబ్బున్నవారికి చేయలేని పని ఏముంది ? కొన్ని నెలలపాటు మరో వూరికి తీసుకువెళ్ళి కూతురు చేసిన పాపాన్ని తుడిచేసి, మామూలు మనిషిగా చేయటం ఆతని చేసిన మొదటి పని. వెను వెంటనే తమ ఆస్తికి తగిన సంబంధాన్ని వెతికి పట్టారు పతిలివాళ్ళ బీసీండాట్లు కపోయినా తమ అంతస్తుకు తగినవాళ్ళేనని తెలిసిన శివానికి అభ్యంతరమూ లేకపోయింది.

అన్ని రోజులూ చెప్పకుండా మాయమయిన ప్రియురాలికోసం, ఎంతగానో వగచిన శేఖరం, తిరిగి ఆమె కనిపించే వరకి దగ్గర చేరి తన బాధనంతా వెళ్ళబోసుకున్నాడు ఆమెని విడిచి వుండలేనని, వెంటనే పెళ్ళి చేసుకుందామని అన్నాడు.

ఆయ్యో పిచ్చివాడా అన్నట్లు చూసిందతనివంక శివాని. "నీలాంటి బుద్ధిహీనుణ్ని పెళ్ళాడేంత తెలివిలేనిదాన్ని కాదు. నేను వేసుకునే ఒక జత బట్టల ఖరీదు అయినా నువ్వు నెలరోజులకి సంపాదించ గలవా ? నా కోరికలు తీర్చగలవా ? అష్టైశ్వర్యాల్లో వున్న నన్ను నీ మురికి జీవితంలోకి ఈడ్చి, సంతోషిద్దామనుకున్నావా ? చాల్చాలు వెళ్ళు. నీతో చేసిన స్నేహానికి నాకిప్పటికొచ్చిన కష్టం చాలు. . అసలు సంగతి చెబుతాను విను. నా పెళ్ళి కప్పుడే సంబంధం కుదిరింది. వరుడు ఎమ్బియే చేసి, స్వంత కంపెనీకే మేనేజరుగా వున్నాడు. లక్షల వ్యాపారం చేస్తున్నాడు "అని పొగరుగా చెప్పింది. ఆశలన్నీ కూలిపోయి పిచ్చివాడిలా అయిపోయినాడా అబ్బాయి. ఆ పరిచయానికి అలా ఫుల్‌స్టాప్ పెట్టేసిన శివాని తన జీవితంలో అటువంటి అధ్యాయమే జరగనట్లుగా మరచిపోయింది.

పెళ్ళికుమారుడు చక్రపాణి అందమూ, చదువూ, ఆస్తితోపాటు మంచి బుద్ధి కూడా కలవాడు. ధనంతోపాటు వచ్చే చెడు అలవాట్లేమీ రాలేదు నలుగురితో కలసి మెలసి తిరిగినా తన హద్దుల్లోపలే వుండేవాడు శివాని కనీసం పెళ్ళయినాక అయినా భర్తను ప్రేమించి, బుద్ధిగా మసలుకొని వుంటే, జీవితం ఒడిదుడుకులు లేకుండా సాగిపోయేది.

కానీ ఆమె జీవితాని కొక ధ్యేయమంటూ లేదు. ఒక నీతి లేదు నిదానం లేదు. పెళ్ళయిన కొన్ని నెలల్లోపలే కొత్త మోజు తీరింది శివానికి. తనంటే ఎంత ప్రేమవున్నా, రోజులో కొన్ని గంటలు మాత్రమే తనతో గడిపే భర్త ప్రవర్తన ఆమెకి నచ్చలేదు అతను పనిచేయటమన్నా, వ్యాపారమన్నా చూపే శ్రద్ధని, చేతకానితనంగా జమ కట్టుకుంది తనదారి తాను చూసుకోవటం మొదలుపెట్టింది

కనీసం పిల్లలయినా పుట్టివుంటే, జీవితంపట్ల ఆమె అభిప్రాయం మారి వుండేదేమో! ఆ అదృష్టమూ లేకపోయింది. తనకు తగిన స్నేహితుల్ని సంపాదించుకుంది. పార్టీలనీ పిక్నిక్‌లనీ మునుపట్లా తిరగటం మొదలుపెట్టింది. చక్రపాణి కిలాంటివి ఇష్టంలేకపోయినా, అతని సంస్కారం ఆమెకి అడ్డుపడనీయ

లేదు. అదే అతను చేసిన పొరపాటు. ఏదో తోచక క్లైము గడపటానికి వెళ తున్న పార్టీలు క్రమంగా ఆక్రమించాయి. క్రమంగా రోజుకొక స్నేహితుడివెంట అర్ధరాత్రి, అపరాత్రి ఇల్లు చేరేదాకా వచ్చింది పరిస్థితి

నయానా భయానా, ఎంతగానో చెప్పి చూశాడు చక్రపాణి. వాళ్ళు తెలివి అహంకారంతో, మర్యాదకూడా మరచిన శివాని, భర్తనే దుర్భాషలాడటాని క్కూడా వెనుదీయలేదు.

"వివేకం పనికిరాని వాడివి. డబ్బు సంపాదించటం మొక్కటే నీకు తెలుసు. నీలా నన్నుండమని శాసించాలని నీ ప్రయత్నం అది నావల్ల కాదు తాళి పేరుతో నీతో నాకు ముడిపడిపోయిం దనుకుంటే అది నీ మూర్ఖత్వం. నీ చేత గానితనాన్ని మంచితనంగా చెలామణి చేయలేవు. భార్యను సుఖపెట్టలేని నువ్వెం దుకు పనికొస్తావు? నా దారి కడ్డురావద్దు నీకెలాగూ ఆనందించే రాతలేదు నేనైనా అనుభవించనీ" అని తెగేసి చెప్పింది. ఇలాంటి వెన్నో సంఘటనలు. ఎన్నో మాటలు.

ఈ గృహ కలహాలతో, ఛిన్నాభిన్న మయిపోతున్న తామిద్దరి బాంధవ్యంతో మునుపట్లా పని చేయలేకపోయాడు. ఎటు వెళ్ళినా అందరూ తనని ఎగతాళిగా చూస్తున్నట్లు ఎందుకూ పనికిరాని వెధవ అని అవమానిస్తున్నట్లు ఊహించుకొని బాధపడసాగేడు. చివరికి విసిగిపోయి పెళ్ళయిన పది సంవత్సరాలకి ఒక రోజు ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదిలి పోయాడు - సన్యాసి అయిపోవాలని.

ఇందుకు పెద్దగా బాధపడలేదు శివాని 'ఇదీ ఒక స్టంటు నన్ను లొంగ దీయటానికి. తీసుకెళ్ళిన డబ్బులన్నీ అయిపోతే, తిండికీ, ఇంటికీ ముఖం వాచి తిరిగిరాడూ?' అని సరిపుచ్చు కుంది.

నిజాని కామెకు అతన్ని గురించి ఆలో చించేంత టయిం కూడా లేదు. ఆమె స్నేహితులకీ ప్రోగ్రాంలకీ ఇరవయి నాలుగ్గంటలు చాలడం లేదు తన కంటికి నచ్చిన మగవాడితో స్నేహం చేయటానికి, ఎంత డబ్బు ఖర్చయినా వెనుకాడలేదు. అతను సంసారి అయితే ఆ సంసార విచ్ఛిత్తి అయేదాకా తృప్తి పడేది కాదు.

కానీ ఆ సంతోషమూ, అనుభవమూ ఎన్నాళ్ళు? ఎన్నేళ్ళు? వయసు, పొగసు చూసి ఆడిన ఆటలన్నీ, అవి కాస్త పోయాక నిల్చిపోయాయి సగం ఆస్తి, సగం వయసు కరిగిపోయాక, మిగిసి పోయాయి ఒక చేదు రుచి మాత్రం మిగులుంది. అప్పటికే ఆమెకి తాగుడు బాగా అలవాటయింది.

నలభై సంవత్సరాలకే రక్తపోటు, దానితో పాటు మరికొన్ని రోగాలు సంక్రమించాయి. అప్పుడనుకుంది తిని

పెళ్ళిచేసుకుని ఏం సాధించానా అని. ఆఖరికి తనకంటూ ఒక బిడ్డయినా మిగలలేదుకదా అనిపించింది. కానీ ఒకప్పుడు పిల్లలు పుడితే తన అందం పాడవుతుందని, పుట్టకపోవటమే మంచిదయిందనీ అనుకున్నదని ఇప్పుడు గుర్తు రాలేదు.

రోగిష్ఠి అయాక మంచంపాలు కావడానికి ఎన్నో రోజులు పట్టలేదు. పక్షవాతం వచ్చి, ఓ కాలూ చెయ్యీ పడిపోయాయి. అప్పుడు ఆ అసహాయ స్థితిలోగానీ ఆమెకి జ్ఞానోదయం కాలేదు కానీ అప్పటికే సమయం మించిపోయింది. జీతానికి పనిచేసే సేవకులు సమయానికి భోజనం పెట్టి, అన్ని సేవలూ చేస్తున్నారు కానీ తన మనసు విప్పి చెప్పుకోవటానికి గానీ, ఒక్క సానుభూతి వచనం చెప్పటానికి గానీ ఒక్క మనిషయినా మిగల్లేదు.

ఏనాడీ ప్రాణం నన్ను విడుస్తుందా అని నిరీక్షిస్తూనే ఎన్నో ఏళ్ళు గడిపింది. ఈ జన్మలోనో, ముందు జన్మలోనో, ఎంతో పాపంచేసి వుంటేనే దీర్ఘవ్యాధులు సంక్రమిస్తాయి రావటం అంటూ జరిగేక త్వరగా ప్రాణం పోదు అది ఒక రకమయిన శిక్ష తన తెలివితక్కువతనంతో బంగారం లాంటి భర్తను పోగొట్టుకున్నందుకు, ఒకప్పుడు ఒక అమాయకుణ్ణి నమ్మించి మోసగించినందుకూ, చేసిన తప్పు చాలక భ్రూణ హత్యకి పాల్పడినందుకూ, తలచుకొని తచుకుని కుమిలిపోయింది. ఆమె శీలం, చరిత్ర తెలిసినవాళ్ళెవరూ,

పెంపకానికయినా తమ పిల్లల్నివ్వలేక పోయారు.

* * *

"ఇప్పుడా శివాని మరణశయ్య మీదుంది. నేను చెప్పినట్లుగా ఆ శివాని నువ్వే అనుకో. ఇప్పుడు నువ్వు మరణిస్తే నీకు ఆత్మశాంతి లభిస్తుందను కుంటున్నావా?" అడిగేరు స్వామి.

ఈ కథ వింటూంటేనే పార్వతి మనసు కలచినట్లయింది. ఇటువంటి జీవితం తనది కావటం కన్నా వేరే దురదృష్టం వుండదు. దీనికంటే తన వ్యగతం ఎంతో మేలు. అంతటి పాప పంకిల మయిన మనిషి కన్నా, నా బ్రతుకే మెరుగు. ఏదో ఒక కొడు కంటూ వున్నాడు తనకి ఆ శివానికేం మిగిలింది? చేసిన పాపాలకి అదీ జన్మ లోనే శిక్ష అనుభవించింది ఆఖరుకామె చస్తే, కంటనీరు పెట్టేవారు కూడా లేకుండా అయింది ఎంత సిరిసంపదలతో ఓలలాడితేనేం లాభం? నా కవేవీ లేక పోయినా, దైహికంగా, మానసికంగా ఒక పవిత్రత దక్కింది. ఒద్దు నాకయితే ఆ బ్రతుకొద్దు — అనుకుంది.

ఆమె మనసులో చేస్తున్న ఆలోచ నల్ని చదివేస్తున్నారు స్వామి.

"ఇప్పుడు చెప్పమ్మా. ఇంకా నీ బ్రతుకులో సార్థకత వుందని అను కోవటం లేదా నువ్వు. ఇంకా ఆత్మ హత్య చేసుకోవాలని అనిపిస్తోందా?" నవ్వుతూ అడిగారు స్వామి.

"అవును—" అనలేకపోయింది పార్వతి.

"చూడు తల్లీ. ప్రతి మనిషి జీవితం లోనూ 'ఒక అర్థం వుంటుంది అది తెలుసుకోవటానికే మనం ప్రయ త్నించాలి. ఎందుకు జీవించాలి అనేది అర్థం అవుతే, ఎలా బ్రతకాలి అనేది సమస్య కాదు నీ కొడుకే నీకు ధ్యేయం. తల్లిగా నీ అవసర మతని కెంతైనా వుంది."

"ప్రతీ తల్లిదండ్రులు, తమ సంతానం తమ కేదో చేయాలని కోరుకునే ముందు తాము వాళ్ళపట్ల తమ బాధ్యతల్ని చక్కగా నిర్వహించామా అని ప్రశ్నించు కోవాలి."

అలా ఆయన చెబుతోంటే, ఆ మాటలే వెలుగు కిరణాలై తన కళ్ళ ముందు చీకట్ని తొలగిస్తున్నట్లుగా తోచ సాగింది.